క్లుప్తంగా

ఉప సర్పంచ్‌గా రత్నశ్రీ



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రత్నశ్రీకి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

అల్లవరం: స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు దాసం శ్రీరామచంద్రమూర్తి సతీమణి రత్నశ్రీ ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల అధికారి వి.స్వర్జన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో రత్నశ్రీని వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెను సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు బాపూజీ అభినందించారు.

హరిణికి ఘన స్వాగతం

యానాం: జనవరి 26న రిపబ్లిక్ డే పెరేడ్‌లో అసిస్టెంట్ ఎన్‌సీసీ ఆఫీసర్ హోదాలో పాల్గొన్న యానాంకు చెందిన బోళ్ల హరిణికి శుక్రవారం పలువురు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కోరంగి కైట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ విభాగాల నుంచి జాతీయ స్థాయి శిబిర క్యాంప్ అయిన ప్రతిష్ఠాత్మకమైన రిపబ్లిక్ డే క్యాంప్ న్యూఢిల్లీలో 121 క్యాడెట్స్‌కు అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పాల్గొని వచ్చిన హరిణికి యానాం, మెట్టకూరు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.

విశ్వసృష్టి దినోత్సవం

అమలాపురం టౌన్: స్థానిక మంచినీటి చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి మందిరం వద్ద జగద్గురు విశ్వకర్మ భగవానుని పంచ బ్రహ్మల ఆవిర్భావ (విశ్వ సృష్టి) దినోత్సవాన్ని పట్టణంలోని విశ్వ బ్రాహ్మణులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోసూరు చిదంబాచారి (చిన్న) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్ మాట్లాడారు.

ప్రజా సంఘాల ధర్నా

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి, రైతులకు నిధుల కోత పెట్టడాన్ని నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున నినాదాలు చేశారు. టి.ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఏర్పాటు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ ఉద్యోగుల సంఘంలో తాజాగా పట్టణంలోని 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు కూడా విలీనం అయ్యారు. ఇప్పుడు కొత్త కార్యవర్గం ఏర్పాటు చేసి వార్డు సచివాలయ కార్యదర్శులకూ కొన్ని పదవులు కేటాయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్, వార్డు సచివాలయ ఉద్యోగుల సమావేశం జరిగింది. దీనికి మున్సిపల్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎంవీఎస్ఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. సంఘం ఉపాధ్యక్షులుగా వైఎస్ భారతి (7వ వార్డు సచివాలయం), సంయుక్త కార్యదర్శిగా తాణంకి బాలకృష్ణ (10వ వార్డు సచివాలయం), సహ కోశాధికారిగా బళ్ల సురేష్‌కుమార్ (8వ వార్డు సచివాలయం), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.తిరుపతిరావు, గొడవర్తి సుధాకర్, పామర్తి తేజోమూర్తి, చింతపల్లి సందీశ్వర్‌లకు బాధ్యతలు అప్పగించారు. సంఘ అధ్యక్షుడు కుడుపూడి రవిశంకర్, ఉపాధ్యక్షుడు పులపకూర శ్రీనివాసరావు, కోశాధికారి కట్టమూరి లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగించారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండల లైటింగ్, సౌండ్, టెంట్ హౌస్, జనరేటర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మురమళ్లలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరాబత్తుల అన్నవరం, వైస్ ప్రెసిడెంట్‌గా మోర్త అజయ్, సెక్రటరీగా మోర్త అంబేడ్కర్, జాయింట్ సెక్రటరీగా ఉద్దిశ బాబి, కోశాధికారిగా శీలం శేషారావును ఎన్నుకున్నారు.

కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కొత్త కార్యవర్గ ప్రతినిధులను అభినందిస్తున్న బంగారు, వెండి వర్తకులు

అమలాపురం టౌన్: అమలాపురం బులియన్ అసోసియేషన్ (బంగారు, వెండి, డైమండ్స్ వర్తకుల సంఘం) కొత్త కార్యవర్గం ఎన్నికలు స్థానిక దుడ్డువారి అగ్రహారంలోని సంఘ భవనంలో శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడిగా మేడిచర్ల త్రిమూర్తులు ఎంపికయ్యారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా రేకపల్లి సూరిబాబు, కార్యదర్శిగా రాయుడు వీరాస్వామి నాథన్, సంయుక్త కార్యదర్శిగా వల్లూరి బ్రహ్మాజీ, ఉపాధ్యక్షులుగా మద్దింశెట్టి ప్రసాద్, దుర్గాప్రసాద్ గైక్వాడ్, నంబూరి సత్యనారాయణ మూర్తి, కోశాధికారిగా చవ్వాకుల కృష్ణ, సహ కోశాధికారిగా కేదారిశెట్టి శ్రీను, ముఖ్య సలహాదారుగా బోణం సత్తిబాబు ఎన్నికయ్యారు. అప్పటి వరకూ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన చింతలపూడి సత్తిబాబు నుంచి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. బంగారు వర్తకుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని నూతన అధ్యక్షుడు త్రిమూర్తులు అన్నారు. కొత్త కార్యవర్గాన్ని బంగారు, వెండి వర్తకులు సత్కరించారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- మంత్రి పినిపే విశ్వరూప్
- గోడిలంకలో గడప గడపకూ..



సంక్షేమ పథకాల లబ్ధిని తెలుపుతూ బ్రోచర్ అందిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్



ముమ్మిడివరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గోడిలంకలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ మంత్రి విశ్వరూప్ పార్టీ శ్రేణులతో కలసి వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయాలకు అతీతంగా ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఏ అవసరం ఉన్నా వార్డు వలంటీర్‌ను సంప్రదించాలన్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, రుణమాఫీ వంటి బహృత్తర పథకాలతో పేదలకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని వివరించారు. పేదలకు ఇళ్ల స్థలం కేటాయించడమే కాకుండా గృహ నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు 90 రోజుల్లో ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. నాయకుడు శ్రీకాంత్, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సెంట్రల్ డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ముత్యాల వెంకట రామకృష్ణ, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు: పొన్నాడ

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ 16వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పొన్నాడతో పాటు నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రాగా ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే సంస్కరణలు చేపట్టారన్నారు. పేదల మోములో చిరునవ్వు చూడడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వానికి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందని అన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, ఆసరా, డ్వాక్రా రుణమాఫీ వంటి పథకాల ద్వారా రూ. 2 లక్షల లబ్ధి చేకూరిందని లబ్ధిదారు మట్టపర్తి వెంకటలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, వేగిరౌతు రాజబాబు, హితకారిణి సమాజం చైర్ పర్సన్ కాశి బాల మునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, మండల పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం (బాబ్జీ), కమిషనర్ జి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోండి

ముమ్మిడివరం: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ కోలా గంగాభవానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ముమ్మిడివరంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యువతీ యువకులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 367 మంది అభ్యర్థులు హాజరుకాగా ఇందులో 124 మందికి ఉపాధి కల్పించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, జగతా పద్మనాభం, బొంతు సత్యశ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాము నాగవేణి, ఎంపీడీఓ ఏఎస్ శ్రీనివాస్, కమిషనర్ జి.లోవరాజు, జేడీఎం కేశవరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.లోక్ మాన్, డీఈఓ వసంతలక్ష్మి, పీఓ నాగబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ముమ్మిడివరం: గ్రామ, వార్డు, సచివాలయ కన్వీనర్లు పార్టీ కార్యకర్తలను సమన్వయ పరుస్తూ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ తెలిపారు. ముమ్మిడివరం శివారు పల్లిపాలెంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు స్వగృహం వద్ద మండల, నగర పంచాయతీ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువైందన్నారు. గ్రామ, వార్డు కన్వీనర్లు గ్రామాలలో కార్యకర్తలతో అనుసంధానమై పనిచేయాలన్నారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని, పెయ్యల చిట్టిబాబు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి, కోలా బాబ్జీ, జగతా పద్మనాభం, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, వేగిరౌతు రాజబాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు

అల్లవరం: గొల్లవిల్లి ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులను ఎంపీ అనురాధ మంజూరు చేశారు. శుక్రవారం పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులను వివరించి నిధులు కేటాయించాలని ఎంపీని మొగళ్లమూరులోని ఆమె నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆమె సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.పది లక్షల నిధులు, మరమ్మతులకు ప్రత్యేక గ్రాంటు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. నిధులు కేటాయించిన అనురాధకు సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, సచివాలయ కన్వీనర్ పోలిశెట్టి వీరబాబు, అంబికా శ్రీను, సుంకర బుజ్జి, వీరవల్లి చినబాబు, సలాది శివాజీ, సలాది మధు, సలాది రాంబాబు, శ్రీనివాస్, దూలం సూరి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపీ అనురాధని కలసిన గొల్లవిల్లి వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్యేల వినూత్న నిరసన



స్కూల్ యూనిఫామ్ ధరించి అసెంబ్లీకి సైకిళ్లపై వచ్చిన డీఎంకే ఎమ్మెల్యేలు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్‌లలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత సైకిల్, యూనిఫామ్, షూ, ల్యాప్‌టాప్‌లు తదితర విద్యా సామగ్రి పంపిణీని ప్రభుత్వం ఆలస్యం చేస్తున్నందుకు ప్రతిపక్ష డీఎంకే ఎమ్మెల్యేలు వినూత్నంగా నిరసన తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశానికి డీఎంకే ఎమ్మెల్యేలంతా విద్యార్థుల్లా యూనిఫామ్ ధరించి రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ప్రతిపక్ష డీఎంకే పార్టీ నేత ఆర్.శివ, మిగిలిన ఆరుగురు ఎమ్మెల్యేలు స్కూల్ యూనిఫామ్‌తో అసెంబ్లీకి వచ్చి అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యా సామగ్రిని వెంటనే అందించాలన్నారు. ఇదిలా ఉంటే పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం కేవలం 24 నిమిషాల్లో ముగిసింది. దీనికి స్పీకర్ ఆర్.సెల్వం అధ్యక్షత వహించగా సీఎం రంగసామి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో 2023–24 పూర్తిస్థాయి డ్రాఫ్ట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారని భావించినప్పటికీ అది జరగలేదు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమావేశానికి హాజరయ్యారు.

ఆసరా కల్పించండి

ఉప్పలగుప్తం: తమ వృత్తికి ఆసరాగా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని భీమేశ్వర లైటింగ్, టెంట్, సౌండ్ జనరేటర్స్ అసోసియేషన్ మండల సమావేశం విజ్ఞప్తి చేసింది. స్థానికంగా అసోసియేషన్ మండల అధ్యక్షుడు చప్పిడి దుర్గారావు అధ్యక్షతన సమావేశం జరిగింది.

పాఠశాలలను తనిఖీ చేయాలి

అమలాపురం రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారులతో సహా ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు పాఠశాలల్లో తరచూ తనిఖీ చేయాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావు అన్నారు. సమనసలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం జిల్లాలోని ఎంఈవోలు, హెచ్ఎంలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ అధ్యక్షత వహించారు. తనిఖీల సమయంలో సిలబస్ సకాలంలో పూర్తి చేస్తున్నారా లేదా అనేది పరిశీలించాలని మధుసూదన్‌రావు అన్నారు. బడికి రాని ఓఎస్సీ విద్యార్థుల కోసం ఎస్ఆర్ సెంటర్లు ప్రారంభించాలన్నారు. జిల్లా ఉప విద్యా శాఖ అధికారి షాలెం రాజు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.రమణశ్రీ, డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతరావు, సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టుకు విరాళం

ఐ.పోలవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాతలు అందిస్తున్న సహకారం ఎనలేనిదని హెచ్ఎం వీధి సురేష్‌బాబు అన్నారు. పాఠశాల ఆవరణలో బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణానికి గ్రామానికి చెందిన రాజా కనస్ట్రక్షన్ అధినేత రాయపురెడ్డి సూరిబాబు (రాజా) రూ. లక్ష, ఎదుర్లంకకు చెందిన నడింపల్లి జగన్నాథరాజు రూ.20 వేల విరాళాన్ని శుక్రవారం హెచ్ఎంకు అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రేవు సొరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యుడు రాయపురెడ్డి బాబి, సిబ్బంది ఆకుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు దాతలను ఆశ్రయించగా వెంటనే ఈ విరాళాలను ప్రకటించారని హెచ్ఎం వివరించారు.



బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు

వరకట్న వేధింపులపై కేసు


ముమ్మిడివరం: వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు. గేదెల్లంకకు చెందిన వింటి వీరబాబు, గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన విజయలక్ష్మిలు ఏడాది కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి కొంతకాలం వారు కాపురం ఉన్నారు. అక్కడి నుంచి వీరబాబు వెళ్లిపోవడంతో విజయలక్ష్మి తన తల్లిని తీసుకుని అత్తారింటికి వెళ్లింది. అత్త సత్యవతి, పిన మావయ్య పెన్నాడ పెద్దకాపు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కళా తపస్వితో అనుబంధం ఎనలేనిది



అమలాపురంలో విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న దివంగత సత్యనారాయణ (ఫైల్)

అమలాపురం టౌన్: కళా తపస్వి, దర్శకుడు కె.విశ్వనాథ్‌కు అమలాపురంతో కళానుబంధం ఉంది. ఆయన 1991లో పట్టణానికి విచ్చేశారు. స్థానిక త్రివేణి నృత్య సంగీత సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో స్థానిక నల్లా వీధిలో జరిగిన కార్యక్రమానికి విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదిక ప్రతినిధి, శ్రీచెన్న మల్లేశ్వర కళా పరిషత్ అధ్యక్షుడు దివంగత నల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో అప్పుడు విశ్వనాథ్‌కు కళాకారుల తరఫున ఘన సత్కారం జరిగింది. అలాగే దర్శకుడు కె.విశ్వనాథ్ మృతికి అమలాపురం సినీ కళాకారుల, కళా పోషకుల సంఘం సంతాపం తెలిపింది. స్థానిక గడియారం స్తంభం సెంటర్ వద్ద సంతాప సభ నిర్వహించింది. సంఘ ప్రతినిధులు కుసుమ మోహనరావు, గుర్రం రామకృష్ణారావు, సినీ కళాకారులు, పోషకులు చల్లా రమణ, నామన దుర్గారావు, డీఎస్ఎన్ కుమార్, జిల్లా చేతి వృత్తుల సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం తదితరులు ప్రసంగించారు.



చిత్రకారుడు అంజి గీసిన కె.విశ్వనాథ్ చిత్రం

కాట్రేనికోన: కళా తపస్వి కె.విశ్వనాథ్ మృతికి చింతిస్తూ కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు ఆకోండి అంజి చిత్ర నీరాజనం సమర్పించారు. ఆయన గీసిన విశ్వనాథ్ చిత్రం ఆకట్టుకుంటోంది.

తాళ్లరేవు: సినీనటి జమున మృతికి తాళ్లరేవులో ఘన నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, ఎస్వీఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు, పుల్లెపు చారిటబుల్ ట్రస్టు అధినేత పుల్లెపు వెంకటేశ్వరరావు తదితరులు జమున చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇదిలా ఉంటే కళా తపస్వి కె.విశ్వనాథ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టి.ఈశ్వరరావు, వల్లు రాజబాబు, వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి

ముమ్మిడివరం: డ్వాక్రా సమైక్య సంఘాలు మరింత బలోపేతం కావడానికి వీఏఓలు బాధ్యతగా పని చేయాలని కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకరప్రసాద్ సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం కొత్తపేట క్లస్టర్ పరిధి గ్రామ సంఘాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా సంఘ సభ్యుల జీవనోపాధి కోసం విడుదల చేసిన నిధుల రికవరీ ఆశాజనకంగా ఉండడం లేదని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎల్‌డీఎం పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ), ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాలను వివరించారు.

వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అమలాపురం రూరల్: జర్నలిస్టులు వాస్తవ వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ), విజయవాడ ఆధ్వర్యంలో ఈదరపల్లి సత్కార్ హోటల్‌లో శుక్రవారం పాత్రికేయులకు 'వార్తాలాప్' వర్క్‌షాప్ జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ పాత్రికేయులు ప్రజల్లో సానుకూల దృక్పథం కలిగించే వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ జీడీ హల్లీకేరి మాట్లాడుతూ ఈ తరగతుల ద్వారా పాత్రికేయులకు వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ పీడీ సత్యవేణి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఏపీడీ జిలానీ, డీఐపీఆర్ఓ లక్ష్మీనారాయణ రెడ్డి, పీఐబీ మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి టి.హెన్రీరాజ్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 69 మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. కియా సంస్థకు చెందిన ప్రతినిధులు ఎ.ఆనందభాస్కర్, అశ్వత్థామ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ రత్నరాజు అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు బహుమతి

యానాం: కేరళ త్రిశూర్‌లో నిర్వహించిన దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో యానాం రీజెన్సీ పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులు సీహెచ్ ఇస్సీ డేనియేల్, సీహెచ్ నిశాంత్ శ్రీవర్ధన్‌లు ప్రతిభ చాటారు. గైడ్ టీచర్లు పీవీ వరలక్ష్మి, కె.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆటోమెటిక్ రెయిన్ షెడ్ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి వచ్చిందని హెచ్ఎం ప్రసాదరావు తెలిపారు.

నేత్రాలను అశ్రద్ధ చేయొద్దు

తాళ్లరేవు: నేత్ర సమస్యలను విద్యార్థులు అశ్రద్ధ చేయరాదని ఆప్తమాలజిస్ట్ సత్తిబాబు అన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో 63 మంది విద్యార్థులకు ఆయన నేత్ర పరీక్షలు చేశారు. పది మంది విద్యార్థులకు పలు లోపాలు ఉన్నట్లు గుర్తించామని సత్తిబాబు తెలిపారు. వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేస్తామన్నారు. స్కూల్ హెచ్ఎం కేఆర్‌కే సాయిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీవీసీలో సినీ బృందం సందడి



బీవీసీలో పాప్ కార్న్ సినిమా హీరో సాయి రోనక్, హీరోయిన్ అవికాగోర్, గంధం మురళి

అమలాపురం రూరల్: పట్టుదలతో చదివి విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని హీరో సాయి రోనక్, హీరోయిన్ అవికాగోర్, సినీ డైరెక్టర్ గంధం మురళి అన్నారు. ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన పాప్ కార్న్ సినిమా యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సందడి చేసింది. ప్రొడ్యూసర్ భోగేంద్ర గుప్తా, కళాశాల చైర్మన్ బోనం వెంకట సతీష్‌తో కలసి సినీ బృందం విద్యార్థులతో ముచ్చటించింది. పాప్ కార్న్ సినిమాలో స్నేహంతో పాటు సమాజానికి ఉపయోగపడే సన్నివేశాలు ఉంటాయని పేర్కొంది.

అరుణకుమారికి అభినందన



అరుణకుమారిని అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ తరఫున అమలాపురం నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధిగా కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి నియమితులు కావడంతో మంత్రి విశ్వరూప్ అభినందించారు. స్థానిక కాటన్ అతిథి గృహంలో శుక్రవారం విశ్వరూప్‌ను ఆమె కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంచాయతీ సమస్యల పరిష్కారానికి అరుణకుమారి కృషి చేస్తున్నారన్నారు. పార్టీ నాయకుడు నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.